క్లుప్తంగా

అన్నసమారాధన



దుళ్లలో ఆలయం వద్ద అన్నసమారాధన

కడియం: దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ మదనగోపాలస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దాతలు, భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయ అర్చకులు ఖండవల్లి ముకుంద వాసు ఆధ్వర్యంలో విశేష హోమాలు, చక్రస్నానం జరిగింది. అనంతరం స్వామివారి ప్రసాదన వితరణ చేపట్టారు. స్థానిక యువత, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఆశ్రమంలో అన్నదానం



అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న కసిరెడ్డి దుర్గాప్రసాద్, నాగమణి దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటి గ్రామంలో మానవీయ ఐక్యసేవా సంఘం వృద్ధులు, అనాథులు, మానసిక వికలాంగుల ఆశ్రమంలో సోమవారం సత్యచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ట్రస్టు సభ్యులు కసిరెడ్డిదుర్గాప్రసాద్, వెంకట నాగమణి దంపతుల వివాహవార్షికోత్సవం సందర్భంగా వృద్ధులకు, అనాథులకు, దివ్యాంగులకు మధ్యాహ్నం, రాత్రి ట్రస్ట్ తరుపున అన్నదానం చేశారు. అలాగే పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి దుర్గాప్రసాద్, వెంకట నాగమణి దంపతులు, కుటుంబ సభ్యులు, సత్య చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు టి.సత్యనారాయణ, టి.రవి, శ్రీరామ్మూర్తి, భరద్వాజ, పి.సాయిదుర్గ, ఆశ్రమం నిర్వాహకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పల్లాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు శ్రీకారం

కడియం: కడియపులంకలోని పునర్నిర్మించిన ఆలయంలో పల్లాలమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఉదయం 9.41 గంటలకు పల్లాలమ్మ విగ్రహంతోపాటు, విజయగణపతి, విద్యాసరస్వతీదేవి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు నిర్ణయించారు. అందులో భాగంగా సోమవారం గ్రామోత్సవం జరిగింది. భారీ ఎత్తున మహిళలు కలశాలతో నదీజలాలను తీసుకువచ్చారు. యాగశాలను సిద్ధం చేశారు. విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామివారి దేవస్థానం ఆ స్థాన శిల్పి, ఆగమ సిద్ధాంత దైవజ్ఞ కురుగంటి షణ్ముఖశాస్త్రి పర్యవేక్షణలో ప్రతిష్టాపన కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆలయ కమిటీ తెలిపింది. మంగళవారం ప్రత్యేక పూజలు, హోమలు నిర్వహించనున్నట్టు కమిటీ తెలిపింది. బుధవారం విగ్రహ ప్రతిష్టాపన పూజలు జరుగుతాయన్నారు. అనంతరం మహాన్నదానం ఉంటుందని వివరించారు.

అక్రమ మద్యం స్వాధీనం

ధవళేశ్వరం: తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తీసుకువచ్చి ధవళేశ్వరంలో అధిక ధరకు విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంఘటనకు సంబంధించి ధవళేశ్వరం సీఐ వినయ్‌మోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధవళేశ్వరానికి చెందిన ఏలూరి సత్యనారాయణ వరప్రసాద్ తెలంగాణ నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు అతని వద్ద నుంచి పది బాటిల్స్ మద్యం సీసాలను, రూ.900 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై క్రాంతి కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ తోనే ప్రత్యేక హోదా సాధ్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పద్మశ్రీ

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ స్పష్టం చేశారు. సోమవారం నగరంలో వై జంక్షన్ ఆనం రోటరీ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక హోదాపై తొలి సంతకం చేస్తానన్న రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రత్యేక హోదా, విభజన హామీలను విస్మరించి ఆంధ్రప్రదేశ్‌కి తీరని ద్రోహం చేసిందని ధ్వజమెత్తారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మార్టిన్ లూథర్, పార్టీ నాయకులు బోడా వెంకట్ ముళ్ల మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

రంగుల హోలీ.. ఆనందాల కేళి



హోలీ వేడుకల్లో యువత సందడి

రాజమహేంద్రవరం రూరల్ : అంతా ఒక్కటి, ఆనందమయమైన జీవితానికి ప్రతీకగా నిలిచేంది హోలీ.. హోలీ రోజు అందరూ ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ చిన్నా పెద్దా అంతా ఆనందంగా గడుపుతారు. పురాణాల ప్రకారం హిరణ్యకశిపుని సోదరి హోలిక అనే రాక్షసి శ్రీమహావిష్ణువు భక్తుడైన ప్రహ్లాదుడిని చంపేందుకు మంటల్లో వేస్తుంది. దైవలీలలతో ప్రహ్లాదుడు తప్పించుకుంటాడు. ఆ మంటల్లో హోలిక పడి దహనమవుతుంది. విష్ణువుకు భక్తుడైన ప్రహ్లాదుడు అతని అపారమైన భక్తే కాపడుతుంది. ఈ సందర్భంగా



ప్రజలందరూ రంగులు జల్లుకుంటూ సంబరాలు చేసుకుంటారు. ఏటా హోలీ పండుగను జరుపుకొంటారు. ఆరోజు రంగులు జల్లుకుంటూ ప్రజలు ఆనందంగా గడుపుతారు. మిఠాయిలు తినిపించుకుంటారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్‌రోడ్‌లోని చందనగార్డెన్స్‌లో హోలీ సోమవారం ఏర్పాటు చేసిన హోలీ ఈవెంట్‌లో యువత కోలాహలంతో సందడి నెలకొంది. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఎంజాయ్ చేశారు. డీజే సౌండ్స్, డాన్స్‌లు, పాటలతో సందడి చేశారు. రెయిన్ డ్యాన్స్, వివిధ రకాల డ్యాన్స్‌లతో కేరింతలు కొట్టారు. అలాగే రాజమహేంద్రవరం నగరంతో పాటు, వివిధ గ్రామాలలో విద్యార్థులు, యువత హోలీవేడుకల్లో మునిగితేలుతూ సందడి చేశారు.

అందరినీ ఒక్కటిగా కలిపేదే హోలీ

- రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్
- నగరంలో మర్వాడీల హోలీ సందడి



హోలీ వేడుకల్లో పాల్గొన్న భరత్‌రామ్ తదితరులు

సీటీఆర్ఐ: వసంత కాలంలో వచ్చే హోలీ పండగకు పురాణ గాథలు ఎన్ని ఉన్నా ప్రజలందరినీ సంఘటిత పరిచే శక్తి ఈ హోలీ వేడుకలకు ఉందని రాజమహేంద్రవరం ఎంపీ, సిటీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని మెయిన్ రోడ్డు టౌన్ హాల్‌లో వికాస్, నందు సంయుక్త ఆధ్వర్యంలో మర్వాడీలు నిర్వహించిన హోలీ వేడుకకు ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మర్వాడీల ఆటపాటలలో ఎంపీ పాల్గొని సందడి చేశారు. డప్పు కొడుతూ వారికి మరింత ఉత్తేజాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ హోలీ పర్వదినాన్న వసంతానికి స్వాగతం పలుకుతూ రకరకాల రంగులు ఒకరిపై ఒకరు జల్లుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. మన ఆంధ్రప్రదేశ్‌లో హోలీకా దహన్, కామ దహనం అని అంటారన్నారు. కారణాలు, కథలు ఏమైనప్పటికీ మానవులలో అంతర్లీనంగా ఉన్న స్థాయీ భేదాన్ని రూపు మాపడానికి హోలీ వేడుక చక్కని వేదికగా ఉపయోగపడుతుందని ఎంపీ భరత్ తెలిపారు. మర్వాడీ మహిళలు ఎంపీ భరత్ నుదుటన విజయ తిలకం దిద్ది, హారతులిచ్చి 'దిగ్విజయీ భవ' అంటూ ఆశీర్వదించారు. మిఠాయి తినిపించారు.

యువతతోనే సమాజాభివృద్ధి



పార్టీలో చేరిన యువతతో ఎంపీ భరత్‌రామ్

- ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్
- టీడీపీ, జనసేన పార్టీల నుంచి 300 మంది వైఎస్సార్ సీపీలో చేరిక

రాజమహేంద్రవరం సిటీ: యువశక్తిని నిర్వీర్యం చేసే రాజకీయ నాయకుల తాట తీయాల్సిన సమయం ఆసన్నమైందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ పిలుపునిచ్చారు. సోమవారం ఎంపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు సుమారు 300 మంది ఉల్లూరి రాజు ఆధ్వర్యంలో ఎంపీ భరత్‌రామ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యువశక్తితోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు హయాంలో ఎటువంటి అభివృద్ధీ జరగలేదన్నారు. సీఎం జగనన్న సంక్షేమ పాలన పేదల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగలన్నా జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్లే సాధ్యమన్నారు. యువత ప్రజలను చైతన్యపరిచే బృహత్తర కార్యక్రమంలో కీలక పాత్ర పోషించాలని ఎంపీ భరత్ రామ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను పాటించాలి

- ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో 265 మంది బైండోవర్
- నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీనివాసులు



కోరుకొండ పోలీసు స్టేషన్‌లో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

మధురపూడి: మే 13వ తేదీన జరగబోయే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు నిబంధనలు పాటించాలని రాజమహేంద్రవరం నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు కోరారు. కోరుకొండ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో భాగంగా ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ తన పనిని మొదలు పెట్టిందన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా, పోలింగ్‌కు ఆటంకం లేకుండా ఉండేందుకు 265 మందిని బైండోవర్ చేసిందన్నారు. వీరిని తహసీల్దార్ ముందు హాజరుపర్చి రూ.లక్ష పూచీకత్తును తీసుకుందన్నారు. ఎన్నికల సజావుగా జరగడానికి, వివిధ రక్షణావసరాల రీత్యా జిల్లా ఎస్పీ, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సరిహద్దులు, తూర్పు గానుగూడెంలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్నికల సందర్భంగా వివిధ దాడులు నిర్వహించి 4 వేల లీటర్ల సారాను, బెల్టుషాపులపై దాడి చేసి 477 మద్యం సీసాలను, 109 గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వివాదాస్పదమైన వ్యక్తులు, పాత కేసుల్లోని 91 మందిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారం కోసం సువిదాలో అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం సింగిల్ విండో సిస్టమ్ ప్రకారం నియోజకవర్గం స్థాయిలో ఆర్‌వో నుంచి, జిల్లా స్థాయిలో కలెక్టర్ ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు. 19 రకాల అనుమతులు (అప్లికేషన్లు) ఉన్నాయని, దీనిలో వాహన, ర్యాలీలు, మైక్, వీధి మీటింగ్‌లు, స్టేజీ ఏర్పాటు చేయడం, ఇంటింటి ప్రచారం, ర్యాలీకి అనుమతులు తీసుకోవాలని సూచించారు. అనుమతులు తీసుకోని వారిపై కేసులు నమోద చేస్తామన్నారు. సువిదాలో అప్లైచేసి, అనుమతులు తీసుకోవాలని, ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కోరుకొండ సీఐ అడపా నాగమురళీ, రాజానగరం సిఐ కాశీ విశ్వనాథ్, కోరుకొండ ఎస్సై డి.ఆనందకుమార్ పాల్గొన్నారు.

బంగారం, వెండి వస్తువుల చోరీ

రాజమహేంద్రవరం రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు తన ఇంటిలోకి ప్రవేశించి రూ.1.50 లక్షలు విలువైన బంగారం, వెండి వస్తువులు అపహరించారని హుకుంపేట సావిత్రీనగర్‌కు చెందిన జామి కృష్ణారావు సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. హుకుంపేట సావిత్రినగర్‌కు చెందిన జామికృష్ణారావు రైల్వేలో లోకో పైలట్‌గా పని చేస్తున్నారు. భార్యపిల్లలు ఊరు వెళ్లగా ఆయన ఆదివారం ఉదయం డ్యూటీ నిమిత్తం వెళ్లి సోమవారం ఉదయం 7 గంటలకు ఇంటికి వచ్చారు. ఇంటి వెనుక కిటికీ గ్రిల్ తొలగించి ఉండడంతో ఇంటిలో పలకి వెళ్లి చూశాడు. బీరువాలోని 50 గ్రాముల విలువైన బంగారు వస్తువులు, కేజీన్నర వెండి వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని జమ్మి కృష్ణారావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వాటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై బి.శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సావిత్రినగర్‌లో రూ.85 వేల సొత్తు

ఇంటిలో రూ.85వేలు విలువైన బంగారం, వెండి వస్తువులు చోరీకి గురయ్యాయని హుకుంపేట సావిత్రినగర్‌కు చెందిన పితాని శ్రీనివాసరావు సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. హుకుంపేట సావిత్రినగర్‌కు చెందిన పితాని శ్రీనివాసరావు, భార్య, పిల్లలతో కలిసి వివాహనం నిమిత్తం ఈనెల 23వ తేదీన ఇతర ప్రాంతానికి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి ముందు కిటికీ గ్రిల్ తొలగించి ఉంది. ఇంటిలోకి వె వెళ్లిచూడగా బీరువాలోని 32 గ్రాముల బంగారపు వస్తువులు, 300 గ్రాముల వెండి వస్తువులు చోరీ గురయ్యాయని, వాటి విలువ రూ.85 వేలు ఉంటుందని పితాని శ్రీనివాసరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోరాటంతోనే జీతాల పెంపు



సమావేశంలో పాల్గొన్న ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ ఆఫీసర్లు

రాజమహేంద్రవరం సిటీ: రెండేళ్ల నిరంతరాయ పోరాటం చేయడం ద్వారా 17 శాతం జీతాలు పెంపు సాధించుకున్నామని ఎస్‌బీఐ ఆఫీషర్స్ అసోషియేషన్ అమరావతి సర్కిల్ ప్రెసిడెంట్ కిషోర్‌కుమార్, జనరల్ సెక్రటరీ సూర్యకుమార్ పేర్కొన్నారు. ఆదివారం హోటల్ రివర్‌బే ఆహ్వనం పంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన 5 జిల్లాలకు చెందిన ఎస్‌బీఐ ఆఫీషర్ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ ఆఫీసర్ల జీతాల పెంపు కోసం 2022 నవంబర్ నుంచి ప్రారంభించిన పోరాటంతో సాధించుకున్నామని, 9 జాయింట్ నోట్ సెటిల్‌మెంట్ కావడంతో 17 శాతం పెంపు సాధించుకున్నామన్నారు. పెరిగిన జీతాలు 2024 మార్చి 25న ఆఫీషర్ల ఖాతాల్లో జమ కావడం ఆనందంగా ఉందన్నారు. త్వరలోనే ఐదు రోజుల పనిదినాలు అమలులోనికి రానున్నాయన్నారు. దీని కోసం సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం సందర్బంగా ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ సమాఖ్య జనరల్ సెక్రటరీ రూపమ్ రాయ్ వర్చువల్‌గా పాల్గొని నిరంతరం ఆఫీసర్స్ యోగక్షేమాల కోసం కృషి చేస్తూనే ఉంటామన్నారు. ఈ సమావేశంలో 5 జిల్లాల నుంచి తరలివచ్చిన సుమారు 450 మంది ఆఫీసర్స్ పాల్గొన్నరన్నారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ నాయకులు విశ్వనాథ్, మంగిన శ్రీనివాసరావు, ఎసీఎస్ శ్రీధర్, గాలి శ్రీనివాసరావు, శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

కంబాలచెరువు: ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ ఉద్యమ నిర్మాతలు అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్యనారాయణరాజు వర్ధంతిని స్థానిక బీవీఎం పాఠశాలలో సోమవారం జరిగాయి. జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు పి.జయకర్ అధ్యక్షతన జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ నేతృత్వంలో అప్పారి, వత్సవాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యా వ్యవస్థ అంతా ప్రభుత్వ రంగంలోనే ఉంటే సమాజంలో అన్ని వర్గాలకు మంచి విద్య దక్కుతుందన్నారు. ఉపాధ్యాయులు హక్కుల సాధనకు పోరాడుతూనే విద్యా పరిరక్షణకు ఉద్యమాలు చేయాలన్నారు. యూటీఎఫ్ రాష్ట కార్యదర్శి ఎస్.అరుణకుమారి మాట్లాడుతూ అప్పారి తన 14 ఏళ్ల సర్వీసును సంఘం కోసం త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు శంకరుడు, కోశాధికారి ఈవీవీఎస్‌ఆర్ ప్రసాద్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ రూపస్, మహిళా అసోసియేట్ శ్రీమణి, రాష్ట్ర కౌన్సిలర్ అనిత, రాష్ట్ర కార్యదర్శులు రమేష్, ప్రకాష్, శ్రీనివాస్, నాగభూషణం, భవాని, రమణ, రవి, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.


మళ్లీ జగన్‌కే పట్టం కడదాం..



దోసకాయలపల్లిలో పార్టీ శ్రేణులతో సమావేశాన్ని నిర్వహించిన జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మళ్లీ పట్టం కడదామని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం కోరుకొండ మండలం దోసకాయలపల్లి జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు నివాస గృహంలో పార్టీ శ్రేణులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ మాట్లాడుతూ అత్యధిక మెజార్టీ సాధనకు పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేయాలన్నారు. రాజానగరం నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన సంగతిని, అర్హులకు నేరుగా సంక్షేమ పథకాలందిస్తున్న సంగతులను ఓటర్లకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, పార్టీ నాయకులు కడియాల పాపారావు, కడవల శివ, నీరుకొండ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

మనోహరం



గోదారమ్మపై నిర్మించిన రెండు వంతెన మధ్య నుంచి అస్తమిస్తున్న సూర్యుడు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాడు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద సోమవారం సాయంత్రం ఈ మనోహర దృశ్యం కనిపించింది. పుష్కరాలరేవుకు వచ్చిన సందర్శకులు, ప్రజలందరూ ఆసక్తిగా తిలకించారు.

– గరగ ప్రసాద్, రాజమహేందవరం

అమ్మవారికి ఘనంగా స్నపన తిరుమంజనం



అమ్మవారికి దోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రకాశంనగర్: లాలాచెరువు వద్ద ఉన్న గోవింద క్షేత్రంలో సోమవారం పాల్గుణ శుద్ధ పౌర్ణమి ఉత్తర ఫల్గుణి నక్షత్రం అమ్మవారి తిరు నక్షత్రం సందర్భంగా అమ్మవారికి నవకలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం సామూహిక సహస్ర నామ కుంకుమార్చన చేశారు. సాయంత్రం పుర ప్పాట్టు(ఊరేగింపు), డోలోత్సవం(ఊంజల్ సేవ)ను అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు ఆయా సేవల్లో పాల్గొన్ని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

చైతన్య మహాప్రభు ఆవిర్భావ మహోత్సవం

ప్రకాశం నగర్: ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో చైతన్య మహాప్రభు 537వ ఆవిర్భావ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం నగర సంకీర్తన, సాయంత్రం హోలీ సందర్భంగా భోగిమంట వేశారు. భక్తి కంకణ వన మహారాజ్ ప్రవచనం చేశారు. అనంతరం స్వామివారికి పుష్పాలతో మహాభిషేకం నిర్వహించారు. 108 పిండి వంటలతో మహారాజ భోగం నిర్వహించారు. శ్రీకృష్ణ చైతన్య మిషన్ డిప్యూటీ సెక్రటరీ అండ్ టెంపుల్ ఇన్‌చార్జు శ్రీపాద హరిదాసు బ్రహ్మచారి ఏర్పాట్లను పర్యావేక్షించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైఎస్సార్ సీపీ అర్బన్, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తలు భరత్ రామ్, గూడూరి శ్రీనివాస్‌లు

ప్రకాశం నగర్: మర్కజ్ మసీద్‌లో సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ అర్బన్ నియోజకవర్గ సమన్వయకర్త మార్గాని భరత్, పార్లమెంట్ సమన్వయ కర్త డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రజలందరూ ఐక్యతతో ఉండాలని, సోదరభావంతో మెలగాలని ఈ రంజాన్ జరుపుకొంటారన్నారు. ఈ కార్యక్రమంలో నిజాం, మటన్ అసోసియేషన్ అధ్యక్షులు కరీముల్లా, సుభాని, సిద్దిక్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్షణక్షణం.. క్షుణ్ణంగా తనిఖీ

నల్లజర్ల: ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే ప్రయత్నాలను కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘం కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. చాలా ప్రాంతాల్లో అధికారులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగానే నల్లజర్ల మండలం వీరవల్లి టోల్ ప్లాజా వద్ద సోమవారం ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్టు సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈచెక్ పోస్టు వద్ద 24 గంటల నిఘా ఉంటుందన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నియమావళి అమల్లోకి రావడంతో నగదు రవాణాపై అధికారులు నిఘా పెట్టారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం బృందాలుగా ఏర్పడి రహదారులపై వాహన తనిఖీలు చేస్తున్నారు. తగిన ఆధారాలు లేకుండా పరిమితికి మించి నగదు, బంగారం, వెండి వస్తువులు, చీరలు ఇతర సామగ్రిని తరలిస్తే జప్తు చేసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రూ.50వేలకు మించి నగదు, రూ.10వేలకు మించి విలువ గల సామగ్రి రవాణా చేయడం నిషిద్ధమని అధికారులు హెచ్చరిస్తున్నారు.

సినిమాలు



శ్యామల	:	భీమా
సూర్యమినీ	:	మడ్గాస్‌ఎక్స్‌ప్రెస్(హిందీ)
సూర్యప్యాలెస్	:	నువ్వు-నేను, కుంగ్‌ఫూపాండా-4
స్వామి	:	ఓంభీంబుష్...
శివజ్యోతి	:	ఓంభీంబుష్...
అనుశ్రీ	:	ప్రేమలు
రాజా	:	లైన్‌మెన్
ఊర్వశి	:	లైన్‌మెన్, రజాకార్
రంభ	:	తంత్ర
మేనక	:	యమధీర, పక్కిరి
అప్సర	:	గామి
కుమారి నామవరం	:	ప్రేమలు
వీఎస్ మహల్ ధవళేశ్వరం	:	ఓంభీంబుష్...
మురళీకృష్ణ	:	ప్రేమలు
కడియం	:	ఓంభీంబుష్...